సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



అన్నీ ఆన్‌లైన్‌లోనే.. 9లో▸

నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం అమల్లోకి తెచ్చింది. నకిలీ విత్తనాల పట్టివేతకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తోంది.

పరస్పర సహకారముండాలి

ఆదిలాబాద్‌టౌన్: బార్, బెంచ్ పరస్పర సహకారంతో కేసులు పరిష్కారమవుతాయని జిల్లా జడ్జి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో సమావేశమయ్యారు. పాత కేసులు త్వరగా పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి శివరాంప్రసాద్, పీపీలున్నారు.

గరిష్టం/కనిష్టం
34.0/23.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురు గాలులతో మోస్తరు వాన పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

జడ్జిలను కలిసిన ఎస్పీ



జడ్జికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్, పీ శివరాంను ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థితిగతులు, పెండింగ్ కేసులపై చర్చించారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఉమేందర్, కోర్టు లైజన్ అధికారి గంగాసింగ్ ఉన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథుడికి నివాళులర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్

కైలాస్‌నగర్: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భగీరథుడిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలంతా సన్మార్గంలో నడవాలని సూచించారు. మహనీయుల ఆశయాలు, జీవిత చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తోందని చెప్పారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి కే రాజలింగు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, సహాయ బీసీ సంక్షేమాధికారి సునీత, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: భద్రాచలంలో మే 5, 6 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభల ప్రచార కరపత్రాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు గురువారం గోండ్‌గూడలో ఆవిష్కరించారు. ఆదివాసీ పెద్దలు, మేధావులు, నిరుద్యోగులు అధికసంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సంఘం మండలాధ్యక్షుడు పెందోర్ కృష్ణ, కమిటీ సభ్యులు చహకటి విశాల్, ఉయిక శేఖర్, తోడసం సందుర్యావ్ తదితరులున్నారు.

నూతన నియామకం



నియామక పత్రాన్ని ఇస్తున్న నాయకులు

నేరడిగొండ: రాష్ట్ర విశ్వకర్మ సెల్ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన చొక్కపల్లి రాములును నియమిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర విశ్వకర్మ సెల్ కన్వీనర్ పసునూరి బ్రహ్మాచారి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలయ భాస్కర్‌రాజు, సంజయ్ గనాటి గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి విశ్వకర్మ కౌసల్య సమ్మాన్ యోజన నిధి ప్రత్యేక బడ్జెట్ పార్లమెంట్ సాక్షిగా ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. 75 ఏళ్ల భారత స్వాతంత్ర్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఈ పథకాన్ని పేద విశ్వబ్రాహ్మణుల చెంతకు చేరేలా అవగాహన కల్పించడానికి ఎంపీ సోయం బాపూరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ సహకారంతో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

వర్గపోరుకు చెక్ పడేనా?



మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావ్

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

- గ్రూపు రాజకీయాలకు రేవంత్‌రెడ్డి చెక్!
- వ్యూహం అమలు చేసిన టీపీసీసీ చీఫ్
- అనుచరులకు పెద్దపీట వేస్తూ ముందుకు..
- తాజా పరిస్థితులపై పార్టీ క్యాడర్‌లో చర్చ

సాక్షి, ఆదిలాబాద్: కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మొన్నటివరకు ప్రేమ్‌సాగర్‌రావ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వర్గాలుగా పార్టీ కొనసాగింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై సరైన పట్టు లభించలేదు. ఇటీవల మహేశ్వర్‌రెడ్డి పార్టీని వీడడంతో ఆ ఖాళీని రేవంత్‌రెడ్డికి అనువుగా మలుచుకోవడంలో సఫలీకృతమయ్యారు. ఇక ప్రేమ్‌సాగర్‌రావ్ వర్గానికి చెక్ పెట్టేలా వ్యూహం అమలు చేశారు. ఆదిలాబాద్ పర్యటనలో ఇది స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్‌లో ఈ వ్యవహారంపై చర్చ సాగుతోంది.

హావభావాలతోనే స్పష్టత..

ఎన్నికల ఏడాదిలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పట్టు కోసం ప్రయత్నిస్తున్న రేవంత్‌రెడ్డికి ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీలో నెలకొన్న పరిస్థితులు అనువుగా మార్చుకునేందుకు తోడ్పడుతున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడు కావడంతో నేరుగా ఆ వర్గ నేతలను దూరం చేసే పరిస్థితులు లేకపోగా, పర్యటనలో రేవంత్ హావభావాలతోనే ఆ స్పష్టత కనబడింది. కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న సమయంలో 'ఒక్కడు పోయాడు.. వేలాది మంది వస్తున్నారు.. పోయినోడు వెంట్రుకతో సమానం' అంటూ.. పరోక్షంగా మహేశ్వర్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. తద్వారా అతను పార్టీని వీడడంతో వచ్చిన నష్టం లేదు.. అనే కోణం కనిపించింది. ఇక ఆదిలాబాద్‌లో ర్యాలీ, మీటింగ్ దృష్ట్యా తన ప్రసంగంలో ఇక్కడి నియోజకవర్గ నేతల పేర్లు ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో వారి పలుకుబడి పెరుగుతుందని ఆశిస్తారు. అయితే టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత గండ్రత్ సుజాత పేరును తన ప్రసంగంలో ప్రస్తావించకపోవడం, ఈ అంశాన్ని అదే సమయంలో కార్యకర్తలు లేవనెత్తగా, వారిపై మండిపడడం ద్వారా పరోక్షంగా ఆ వర్గాన్ని విస్మరించేలా వ్యవహరించారనే ప్రచారం పార్టీలో జరుగుతోంది. ప్రధానంగా గండ్రత్ సుజాత ప్రేమ్‌సాగర్‌రావ్ వర్గంగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే రేవంత్‌రెడ్డి ఈ విధంగా వ్యవహరించారని పార్టీలో చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ వర్గం నేతలు తమ రాజకీయ భవిష్యత్‌పై డైలామాలో పడ్డారు. మున్ముందు ఎలాంటి పరిస్థితులు ఉంటాయనేది పార్టీలో ఆసక్తి నెలకొంది.

పార్లమెంట్ నియోజకవర్గంపై దృష్టి

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో తన అనుచరగణాన్ని పూర్తి స్థాయిలో పెంచుకునేలా రేవంత్‌రెడ్డి దృష్టి సారించారని పార్టీలో చెప్పుకొంటున్నారు. ఈ నియోజకవర్గాల్లో తన క్యాడర్‌ను ప్రోత్సహించడం ద్వారా పార్లమెంట్ నియోజకవర్గంపై పట్టు సాధించేలా ముందుకు కదులుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ పరంగా ప్రేమ్‌సాగర్‌రావ్ తన క్యాడర్‌ను ప్రోత్సహిస్తూ వచ్చారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో తనవారికి ప్రాధాన్యం కల్పిస్తూ ముందుకు కదిలారు. ఇక రేవంత్ నిరుద్యోగ నిరసన సమరభేరి ద్వారా ఆదిలాబాద్‌లో అడుగు పెట్టడం, ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలను కోరడం ద్వారా ఇక తన ఫోకస్ దీనిపై ఉందని స్పష్టత నిచ్చారు. పరోక్షంగా తనకు వ్యతిరేకంగా రాష్ట్ర నేతలతో కదులుతున్న ప్రేమ్‌సాగర్‌రావ్‌కు సవాల్ విసిరారు. ఒకవైపు పీఎస్ఆర్ ఉమ్మడి జిల్లాపై పూర్తి ఆధిపత్యానికి ప్రయత్నిస్తుండగా, రేవంత్‌రెడ్డి తన అనుచరగణం ద్వారా మొదలుపెట్టిన ఈ రాజకీయం కాంగ్రెస్‌లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

30న కానిస్టేబుల్ తుది రాత పరీక్ష

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఈ నెల 30న నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుల్ తుది రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, బయోమెట్రిక్ నిర్వహణ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో 12 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, జిల్లా వ్యాప్తంగా 4,824 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్), విద్యార్థి డిగ్రీ కళాశాల, సీబీఆర్ మోడల్ స్కూల్, లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్సెస్), శ్రీసరస్వతి శిశుమందిర్, ఆదిత్య జూనియర్ కళాశాల, ప్రభుత్వ గజిటెడ్ నంబర్–1 ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ గజిటెడ్ నంబర్–2 ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య పాఠశాల, నలంద డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. అభ్యర్థులు ఉదయం 8.45గంటలకు కేంద్రాలకు చేరుకోవాలని, 10గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లతో రావద్దని తెలిపారు. ఎంపిక విధానం పారదర్శకంగా ఉంటుందని, ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించే దళారులతో మోసపోవద్దని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీలు ఎస్.శ్రీనివాసరావు, సీ సమైజాన్‌రావు, బీ రాములునాయక్, పరీక్ష రీజినల్ కోఆర్డినేటర్లు జగ్రామ్ అంతర్వేది, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామనడం సరికాదు'



మాట్లాడుతున్న మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి

కైలాస్‌నగర్: ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లను తాము అధికారంలోకి వస్తే తొలగిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడం సరికాదని మాజీ మంత్రి చిల్కూరి రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ఏ ఒక్కదాన్ని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొన్న నిరుద్యోగ ర్యాలీ విజయవంతమైందని తెలిపారు. సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ బలపడుతుందని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, కౌన్సిలర్ అంబకంటి అశోక్, నాయకులు అల్లూరి సంజీవ్‌రెడ్డి, యాసం నర్సింగ్‌రావు తదితరులున్నారు.

డీసీఎంఎస్ డైరెక్టర్‌కు సన్మానం



గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న మారుతి, నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని గురువారం డీసీఎంఎస్ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, నాయకులు శాలువాలతో సన్మానించారు. అనంతరం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ఏ డీసీసీబీ మేనేజర్ మెస్రం కోసేరావ్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అమ్జద్, నాయకులు షేక్ సుఫీయాన్, కదం మహేశ్, కేంద్రే శ్యామ్, పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్, అధికారులు సునీల్, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

అజయ్ పథకం ఎస్సీలకు అభయం

- ఎంపీ సోయం బాపూరావు
- బోర్‌వెల్ పనులు ప్రారంభం



బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీ బాపూరావు

నేరడిగొండ: ఎస్సీల అభ్యున్నతికి ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (అజయ్) పథకం అభయం లాంటిదని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు పేర్కొన్నారు. గురువారం సవర్గాం గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రైతులకు మంజూరైన బోర్‌వెల్ పనులు ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేరడిగొండ, వడూర్, తర్నం, కొర్టికల్, తేజాపూర్, సవర్గాం గ్రామాలు అజయ్ పథకానికి ఎంపిక కాగా 66 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో యూనిట్ ధర రూ.3.25లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. బోర్‌వెల్స్, విద్యుత్ సౌకర్యం, చేను చుట్టూ కంచె, పైపులైన్ నిర్మాణం తదితర పనులు చేపట్టవచ్చని తెలిపారు. అంతకుముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమస్యలు పరిష్కరించేలా చూడాలని వీవోఏలు ఎంపీకి వినతిపత్రాన్ని అందజేశారు.

వినతిపత్రం అందజేత

రైతులు పండించిన పంటలు రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపీ సోయం బాపూరావు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి నేరడిగొండ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ మీరాబాయికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టం చేస్తోందని ఆరోపించారు. రైతు వ్యతిరేక ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు సోనయ్య హీరాసింగ్, నాయకులు జాదవ్ పరశురాం, మాధవ్‌రావు ఆమ్టే, తొడసం శంకర్, జీఆర్ కుర్మే, అనుపట్ల సంజీవ్‌కుమార్, ధర్మపురి రాఘవులు, వెంకటేశ్, తీగల నవీన్, రాజేశ్వర్, భీంరావు, గంధం నవీన్ తదితరులున్నారు.

నేటి నుంచి పంచాయతీ కార్యదర్శుల సమ్మె



డీఎస్పీకి సమ్మె నోటీసు ఇస్తున్న కార్యదర్శులు

కైలాస్‌నగర్: సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని, నాలుగేళ్ల ప్రొబెషనరీ పీరియడ్‌ను సర్వీస్‌కాలంగా పరిగణించాలనే డిమాండ్‌తో జిల్లాలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగారు. గురువారం అడిషల్ కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్, డీఎస్పీ ఉమేందర్‌ను కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. కాగా, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 13న ప్రభుత్వానికి సమ్మె నోటీస్ అందజేశారు. 28వ తేదీలోగా తమ క్రమబద్ధీకరణపై జీవో విడుదల చేయాలని, లేకుంటే సమ్మెకు వెళ్తామని అల్టిమేటం జారీ చేశారు. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మె అనివార్యమైంది. శుక్రవారం నుంచి పంచాయతీ కార్యదర్శులు విధులు బహిష్కరించి ఆందోళన బాట పట్టనున్నారు. ఫలితంగా గ్రామాల్లో పంచాయతీ పాలన స్తంభించనుంది. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు ఆసరా పెన్షన్ల పంపిణీకి ఆటంకం ఏర్పడే అవకాశముంది. ప్రభుత్వ ఆదేశాల కనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడతామని, ఇంకా తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు.

- పీఎంశ్రీకి 16 పాఠశాలల ఎంపిక
- కార్పొరేట్ తరహా బోధనకు చర్యలు
- ఒక్కో పాఠశాలకు రూ.45 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు కేటాయింపు

సర్కారు బడులకు మహర్దశ



పీఎంశ్రీకి ఎంపికైన బజార్‌హత్నూర్ ఆదర్శ పాఠశాల

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడులను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్ది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని కింద జిల్లాలో 16 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఒక్కో పాఠశాలకు రూ.45 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు నిధులు రానున్నట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు కూడా నిర్వహించనున్నారు.

16 పాఠశాలల ఎంపిక

ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖాధికారులను ఆదేశించింది. యూడైస్ ప్రకారం జిల్లాలో 102 పాఠశాలలను అర్హత కలిగిన వాటిగా గుర్తించగా ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. పాఠశాలకు సంబంధించిన ప్రశ్నావళి ద్వారా సమాచారం పొందుపర్చారు. పలు పాఠశాలల వివరాలు డీఈవోలు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు పంపించగా ఇందులోంచి రాష్ట్ర ప్రభుత్వం 27 పాఠశాలలను ఎంపిక చేసి కేంద్రానికి నివేదించింది. అయితే కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని 16 పాఠశాలలను ఎంపిక చేసింది. వీటిలో ఇంద్రవెల్లి జెడ్పీఎస్ఎస్, నేరడిగొండ మండలం లఖంపూర్ టీఎస్‌డబ్ల్యూ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, తలమడుగు జెడ్పీఎస్ఎస్, తాంసి మండలం కప్పర్ల జెడ్పీఎస్ఎస్, బేల జెడ్పీఎస్ఎస్, భీంపూర్ మండలం నిపాని ప్రాథమికోన్నత పాఠశాల, జైనథ్ మండలం దీపాయిగూడ ప్రాథమిక పాఠశాల, నార్నూర్ మోడల్ స్కూల్, సిరికొండ యూపీఎస్, ఉట్నూర్ టీడబ్ల్యూ బాలికల ఆశ్రమ పాఠశాల, ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ జెడ్పీఎస్ఎస్, బజార్‌హత్నూర్ మోడల్ స్కూల్, బోథ్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్, గుడిహత్నూర్ మోడల్ స్కూల్, ఇచ్చోడ జెడ్పీఎస్ఎస్, ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ గజిటెడ్ ఉన్నత పాఠశాల ఎంపికయ్యాయి. జిల్లాలో 18 మండలాలుండగా 16 మండలాలకు సంబంధించిన పాఠశాలలు ఎంపికయ్యాయి. మావల, గాదిగూడ మండలాలకు చెందిన పాఠశాలలు ఎంపిక కాలేదు.

పథకం ద్వారా ప్రయోజనాలివే..

పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.45 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు నిధులు కేటాయించనుంది. సంప్రదాయ పద్ధతిలో బడి తోట పెంపకం, విద్యార్థులకు ఆకుకూరలు, కూరగాయలు స్థానికంగా పండించి వాటితోనే భోజనం అందించేలా చర్యలు చేపడతారు. ఆధునిక బోధన పద్ధతులను అవలంబించడం, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్, గణితం ల్యాబ్‌లు, ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ, జాతీయ నూతన విద్యావిధానం అమలయ్యేలా చర్యలు చేపట్టడం, ప్రహరీ, అదనపు తరగతి గదులు, డిజిటల్ లైబ్రరీ, స్మార్ట్ క్లాస్ రూంలు, క్రీడా మైదానం, పరికరాల ఏర్పాటు తదితర సౌకర్యాలు కల్పించనున్నారు.

16 పాఠశాలలు ఎంపికయ్యాయి



పీఎంశ్రీ పథకం కింద 102 పాఠశాలల నుంచి ప్రతిపాదనలు పంపగా 16 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ పాఠశాలలకు అన్ని మౌలిక వసతులు సమకూరనున్నాయి. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. యూ డైస్ ప్రకారం ఈ పాఠశాలలను ఎంపిక చేశారు. కార్పొరేట్ తరహాలో అన్ని హంగులతో ఈ పాఠశాలలు అభివృద్ధి చెందనున్నాయి. విద్యా ప్రమాణాలు కూడా మెరుగు పడనున్నాయి.

– జెట్టి నారాయణ, సెక్టోరియల్ అధికారి

కార్పొరేట్ తరహా అభివృద్ధికి చర్యలు



కేంద్ర ప్రభుత్వం సర్కారు బడులను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దేందుకు పీఎంశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద సర్కారు బడులకు మహర్దశ పట్టనుంది. దేశవ్యాప్తంగా 14,500 పాఠశాలలు ఎంపిక కాగా, జిల్లాలోని 16 పాఠశాలలను ఎంపిక చేశారు. దీంతో పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. త్వరలో నిధులు విడుదల చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– గోపీకృష్ణ, టీయూపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

'తల్లి పిలుపు'ను పకడ్బందీగా అమలు చేయాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ట్రైనీ కలెక్టర్ శ్రీజ

ఆదిలాబాద్‌టౌన్: తల్లి పిలుపు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ట్రైనీ కలెక్టర్ శ్రీజ సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో 'తల్లి పిలుపు' కాల్ సెంటర్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాతా శిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులకు ఫోన్ చేసి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలని సూచించారు. రక్తహీనత, బీపీ, షుగర్ ఉన్నవారిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తదితరులున్నారు.

ఆదిలాబాద్‌రూరల్: అసోదా గ్రామపంచాయతీ పరిధిలోని బుర్కి గ్రామంలో రూ.10లక్షల గవర్నర్ నిధులతో ఎస్టీ కమ్యూనిటీహాల్, రూ.11 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. గురువారం పనుల పురోగతిని ట్రైనీ కలెక్టర్ పీ శ్రీజ తెలుసుకున్నారు. అనంతరం అధికారులు, కాంట్రాక్టర్‌తో పనుల పురోగతిపై ఆరా తీశారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈమె వెంట పంచాయతీరాజ్ ఏఈఈ సల్లావొద్దీన్, కాంట్రాక్టర్ చౌహాన్ ప్రకాశ్ ఉన్నారు.

భీంపూర్‌లో గాలివాన బీభత్సం



అర్లి(టీ) వద్ద గాలివానకు నేలకొరిగిన చెట్టు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టీ), అంతర్గాం, ఇందూర్‌పల్లి, గోముత్రి, కరంజి, గుబిడి తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. అంతర్గాం, ఇందూర్‌పల్లి గ్రామాల్లో ఇళ్లు, పశువుల పాకల పైకప్పు రేకులు లేచిపోయాయి. అంతర్గాంలో బక్కి కపిల్ తన పంట చేనులో వేసిన షెడ్డు రేకులు పైకి లేచి పంటచేనులో పడ్డాయి. అర్లి(టీ) సమీపంలో అంతర్రాష్ట్ర రోడ్డుపై చెట్టు విరిగిపడగా పంచాయతీ కార్మికులు, గ్రామస్తులు తొలగించారు. పలు గ్రామాల్లో జొన్న, నువ్వు, పెసర పంటలు కొంతమేర దెబ్బతిన్నాయి. పలుచోట్ల విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడగా సరఫరాలో అంతరాయమేర్పడింది. ఉదయం సిబ్బంది మరమ్మతు చేసి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

క్లుప్తంగా

రేపు మెడికోలకు స్కాలర్‌షిప్‌లు

ఆదిలాబాద్‌టౌన్‌: ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఈనెల 29న రిమ్స్‌లో 25మంది మెడికోలకు స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్‌ అశోక్‌, శ్యామ్‌ప్రసాద్‌ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీఎస్‌ రావ్‌ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఐఎంఏ ఆధ్వర్యంలో మెడికోలకు స్కాలర్‌షిప్‌లు అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు.

బాసరలో దొంగల భయం

భైంసాటౌన్‌: బాసర మండలంలో గుర్తు తెలియని దొంగలు హల్‌చల్‌ చేస్తున్నారు. వరుసగా రెండోరోజూ నాలుగిళ్లలో చోరీలకు పాల్పడ్డారు. కిర్గుల్‌(బి) గ్రామంలో బుధవారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఎస్సై మహేశ్‌ వివరాల ప్రకారం.. కరాండె కపిల్‌, గౌతం, శ్రీపాల్‌లు పక్కపక్క ఇళ్లల్లో ఉంటున్నారు. రాత్రి ఇంటికి తాళం వేసి పక్క ఇంట్లో పడుకోగా గుర్తు తెలియని దొంగలు తాళం పగలగొట్టి రూ.2.54లక్షల విలువైన బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. అలాగే షేక్‌ మెయిన్‌ ఇంట్లో రూ.90వేల విలువైన బంగారు నగలు ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫిర్యాదు చేసిన 24గంటల్లో ఫోన్‌ స్వాధీనం



బాధితుడికి ఫోన్‌ అప్పగిస్తున్న డీఎస్పీ ఉమేందర్‌

ఆదిలాబాద్‌టౌన్‌: ఫోన్‌ పొగొట్టుకున్న బాధితుడికి పట్టణ టూ టౌన్‌ పోలీసులు ఫిర్యాదు చేసిన 24గంటల్లోనే అప్పగించారు. స్థానిక సంజయ్‌ నగర్‌ కాలనీకి చెందిన ఎస్‌కే యూసుఫ్‌ ఈ నెల 7వ తేదీన తన మొబైల్‌ ఫోన్‌ను పొగొట్టుకున్నాడు. 26వ తేదీన టూ టౌన్‌ పోలీస్‌స్టేషన్లో నూతనంగా కేంద్ర టెలికాం, పోలీస్‌ ద్వారా సంయుక్తంగా ఏర్పాటు చేసిన సీఈఐఆర్‌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేశాడు. 27వ తేదీన ఓ వ్యక్తి వద్ద ఫోను గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితుడికి డీఎస్పీ ఉమేందర్‌, టూ టౌన్‌ సీఐ పురుషోత్తం అప్పగించారు. ఆదిలాబాద్‌ జిల్లాలో ఇప్పటివరకు నూతన సిస్టం ప్రారంభించిన వారంలోనే 5 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్‌ సీసీటీఎన్‌ఎస్‌ రైటర్‌ శరత్‌ పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

నిర్మల్‌టౌన్‌: యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్‌ గురువారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్‌ వివరాల ప్రకారం... మామడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో 2018 మే 11న యువతి ఇంట్లో ఒంటరిగా ఉండగా అసభ్యకరంగా ప్రవర్తించిన మేకల శేఖర్‌ అలియాస్‌ రాజశేఖర్‌పై కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రాంనర్సింహారెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జీషీట్‌ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోక్సో స్పెషల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ విశ్వాస్‌రెడ్డి సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు నిచ్చారు.

పిడుగుపాటుకు ఇంటి పైకప్పు ధ్వంసం



ధ్వంసమైన ఇంటి పైకప్పు

కుంటాల: మండల కేంద్రంలో గురువారం ఉదయం ఒడ్నం గంగాధర్‌ ఇంటి స్లాబ్‌పై పిడుగుపడడంతో పైకప్పు దెబ్బతింది. మండలంలో కురిసిన వర్షంతో మొక్కజొన్న తడిసిపోగా నువ్వు పంట నెలకొరిగింది. సంఘటనా స్థలాన్ని ఆర్‌ఐ విజయ్‌ పరిశీలించారు.

శివాజీ చౌక్‌లో



బస్టాండ్‌ ప్రాంతంలో



పాత బస్టాండ్‌ ఏరియాలో ప్రమాదకరంగా హోర్డింగ్‌





ప్రమాదకరంగా హోర్డింగ్‌లు

నిర్మల్‌ జిల్లా కేంద్రంలో ఇటీవల భారీగా గాలులతో కూడిన వర్షం కురువడంతో హోర్డింగ్‌లు ప్రమాదాలకు నిలయాలుగా దర్శనమిస్తున్నాయి. గతంలో హోర్డింగ్‌లు విద్యుత్‌ తీగలపై పడిన సందర్భాలు అనేకమున్నాయి. ప్రస్తుతం మళ్లీ ఈదురుగాలుల సీజన్‌ మొదలైంది. ఈ నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్‌లపై ఉన్న ఫ్లెక్సీలు విద్యుత్‌ తీగలపై చిరిగిపోయి పడుతుండడంతో ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు దృష్టిపెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్‌, నిర్మల్‌

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌లో బియ్యం పరిశీలిస్తున్న పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌ రవీందర్‌సింగ్‌

- పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌ రవీందర్‌సింగ్‌

భైంసాటౌన్‌: అకాల వర్షాల నేపథ్యంలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌ రవీందర్‌సింగ్‌ అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్‌ రాంబాబు, డీఎస్‌వో తనూజతో కలిసి గురువారం భైంసాకు వచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో రైస్‌మిల్లర్లు, స్థానిక బీఆర్‌ఎస్‌ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఆయన మిర్చి మార్కెట్‌ యార్డులోని గోదాంలో నిల్వ ఉంచిన గన్నీ సంచులను పరిశీలించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 30 లక్షల గన్నీ సంచులు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, మంచినీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం అక్కడే ఉన్న ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌ను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ.. రైస్‌మిల్లుల నుంచి వచ్చే ప్రతీ బియ్యం సంచిని పరిశీలించాలని సూచించారు. నాణ్యత లేని వాటిని వెంటనే తిరిగి పంపాలన్నారు. కాసేపు హమాలీలతో ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్‌ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నాణ్యమైన బియ్యం అందించాలి

లోకేశ్వరం: రేషన్‌ షాపులకు నాణ్యమైన బియ్యం అందించాలని తెలంగాణ సివిల్‌ సప్లయ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ రవీందర్‌సింగ్‌ సూచించారు. మండలంలోని సేవాలాల్‌ తండాలోని రైస్‌మిల్‌ను గురువారం తనిఖీ చేశారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం ఎలాంటి షరతులు లేకుండా తీ సుకోవాలని సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్‌ రాంబాబు, డీఎస్‌వో తనూజ, డీఎం శ్రీలత, డెప్యూటీ తహసీల్దార్‌ అశోక్‌ ఉన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్‌ శ్రీధర్‌

ఆదిలాబాద్‌టౌన్‌: పాలియేటీవ్‌ కేర్‌లో చికిత్స పొందుతున్న రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఎన్‌సీడీ ప్రోగ్రామ్‌ అధికారి డాక్టర్‌ మెట్‌పెల్లివార్‌ శ్రీధర్‌ అన్నారు. గురువారం రిమ్స్‌లోని పాలియేటీవ్‌ కేర్‌ సెంటర్‌ను సందర్శించారు. రోగులకు అందుతున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి పాలియేటీవ్‌ కేర్‌లో చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్‌ నెలలో 26 మంది అవుట్‌ పేషెంట్లను, 27మంది ఇన్‌పేషెంట్లకు మొత్తం 167 మంది క్యాన్సర్‌ బాధితులకు చికిత్స అందించడం జరిగిందని పేర్కొన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు.

మళ్లీ అదే వ్యథ..!





ఎన్ని విమర్శలు వచ్చినా.. ఎన్ని ఆరోపణలు ఎదుర్కొంటున్నా.. ఆదిలాబాద్‌లోని రిమ్స్‌ ఆస్పత్రి సిబ్బంది తీరు మారడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగులను సంబంధిత వార్డులకు తీసుకెళ్లాల్సిన పేషెంట్‌ కేర్‌ సహాయకులు పత్తా లేకుండా పోయారు. గురువారం అనారోగ్యంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి వచ్చిన రోగిని ఆమె కుటుంబీకులే ఎమర్జెన్సీ వద్ద స్ట్రెచర్‌ తీసుకువచ్చి లోనికి తీసుకెళ్లింది. దృశ్యం రిమ్స్‌లో నెలకొన్న రోగుల అవస్థలకు నిదర్శనంగా నిలుస్తోంది.
- సాక్షి ఫొటోగ్రాఫర్‌, ఆదిలాబాద్‌

ఫౌంటేన్‌ కాదు.. పైప్‌లైన్‌ పగిలింది





నిర్మల్‌ జిల్లా కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్‌ కార్యాలయం ఎదుట గురువారం రాత్రి మున్సిపల్‌ వాటర్‌ పైప్‌ లైన్‌ పగిలిపోవడంతో ఫౌంటేన్‌ను తలపించింది. రోడ్డుపై వృథాగా నీరు పోతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం స్పందించకపోవడం కొసమెరుపు.
- సాక్షి ఫొటోగ్రాఫర్‌, నిర్మల్‌

మొక్కజొన్న రైతుల స్వీయ నిర్బంధం



పంచాయతీ కార్యాలయంలో స్వీయ నిర్బంధంలో రైతులు

బోథ్‌: మొక్కజొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్‌ చేస్తూ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన రైతులు గ్రామపంచాయతీలో గురువారం స్వీయ నిర్బంధనం చేసుకున్నారు. గ్రామపంచాయతీ గది లోపల నుంచి తాళం వేసుకున్నారు. ప్రభుత్వం పంట కొనుగోలు చేసినంత వరకు తాము బయటకు వచ్చే ప్రసక్తే లేదని తెలిసి చెప్పారు. దాదాపు నాలుగు గంటల పాటు నిర్బంధంలోనే ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై రవీందర్‌ రైతులతో మాట్లాడారు. పీఏసీఎస్‌ చైర్మన్‌ కదం ప్రశాంత్‌ రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లకు అనుమతినిచ్చిందని తెలిపారు. దీంతో రైతులు పంచాయతీ భవనం గది నుండి బయటకు వచ్చారు.

కుక్కల దాడిలో పశువు మృతి

బోథ్‌: మండలంలోని మర్లపల్లి గ్రామంలో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. తాజాగా రెండు రోజుల క్రితం ఓ పశువుపై దాడిచేయగా మృత్యువాత పడింది. మరో పశువుపై దాడి చేయగా పశు వైద్యాధికారులు చికిత్స అందించారు.

మరో నిందితుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్‌: అంబేద్కర్‌ జయంతి వేడుకల్లో ఘర్షణలకు పాల్పడిన మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్‌ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన షేక్‌ అయాన్‌ పరారీలో ఉండగా గురువారం పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

నర్సాపూర్‌(జి): మండలంలోని అర్లి(కే) గ్రా మ శివారులోని శ్మశాన వాటిక దగ్గర పేకాట ఆడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు స్పెషల్‌ పోలీసు బృందం దాడి చేసి నలుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3620 నగదు స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాకాల గీత పేర్కొన్నారు.

ధాన్యం తనిఖీ కేంద్రం ఏర్పాటు

కోటపల్లి: తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ నుంచి ధాన్యం ఇక్కడికి రాకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కోటపల్లి మండలం రాపన్‌పల్లి ప్రాణహిత నది వంతెనపై ధాన్యం తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఛార్‌ధామ్‌ యాత్రీకులకు ప్రత్యేక ఏర్పాట్లు

- ఎంపీ సోయం బాపూరావు



బస్సును ప్రారంభిస్తున్న ఎంపీ బాపూరావు

ఆదిలాబాద్‌: జిల్లా నుంచి ఛార్‌ ధామ్‌ యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ఆదిలాబాద్‌ ఎంపీ సోయం బాపురావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం నుంచి గురువారం ఛార్‌ధామ్‌ యాత్రకు బయలుదేరిన 40 మంది యాత్రికుల ప్రత్యేక బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని పుణ్యక్షేత్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్‌ శంకర్‌ మాట్లాడుతూ ఛార్‌ ధామ్‌ యాత్రను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌ రెడ్డి పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక హెల్ప్‌ లైన్‌ కౌంటర్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మఠాధిపతి శ్రీశ్రీ శ్రీ యోగానంద సరస్వతి స్వామి, నాయకులు రత్నాకర్‌ రెడ్డి, సునంద రెడ్డి, ముకుంద్‌ రావు, చిల్కూరి జ్యోతి రెడ్డి తదితరులు ఉన్నారు.

సాయి పారాయణం



నిర్మల్‌లో పాల్గొన్న భక్తులు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని రాంనగర్‌ పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం సాయిపారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కౌన్సిలర్‌ ఆకోజి కిషన్‌ ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో పూజారి సురేష్‌ ఆచారి, రమణ ,సుభాష్‌ ,అశోక్‌, ప్రకాష్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

కుంటాలలో...

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో రెండో షిర్డీగా ప్రసిద్ధి చెందిన సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. బాబాకు మంగళస్నానం, అభిషేకం, అలంకరణ, గోపూజ కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



లోకేష్‌రెడ్డి(ఫైల్‌)



లోకేష్‌రెడ్డి మృతదేహం

సారంగపూర్‌: మండలంలోని ప్యారమూర్‌ గ్రామానికి చెందిన లోకేష్‌రెడ్డి(25) గురువారం సాయంత్రం ఈదురుగాలులకు తెగిపడిన త్రీఫేజ్‌ విద్యుత్‌ తీగ తగిలి పంటపొలంలో మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువుల వివరాల ప్రకారం... గురువారం సాయంత్రం ఈదురుగాలులు, మెరుపులు, పిడుగులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. ఈదురుగాలులతో లోకేష్‌రెడ్డి పంటపొలంలో బోరు బావి మోటారుకు అమర్చిన త్రీఫేజ్‌ విద్యుత్‌ వైరు తెగిపడింది. రోజువారి పనుల్లో భాగంగా గాలివాన తగ్గిన తర్వాత పశువులకు పచ్చిగడ్డి కోసుకురావడానికి తన పంటపొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో తెగిపడిన విద్యుత్‌ వైరును గమనించని లోకేష్‌రెడ్డి దానిపై అడుగు వేయడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏడాది క్రితమే డిగ్రీ పూర్తి చేసిన లోకేష్‌రెడ్డి తండ్రికి చేదోడువాదోడుగా వ్యవసాయ పనులు చేస్తున్నాడు. దీంతో కుటుంబీకుల రోదనలు అక్కడి వారిని కంటతడిపెట్టించాయి.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



బాలు మృతదేహం

నర్సాపూర్‌(జి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బుర్గుపల్లి(జి) గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... జాదవ్‌ బాలు(36) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల అప్పులు పెరగడంతో మద్యానికి బానిసయ్యాడు. భార్య జ్యోతి మూడు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందుతాగాడు. గమనించిన స్థానికులు నిర్మల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గీత తెలిపారు. బాలుకు ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



వినోద్‌(ఫైల్‌)

మామడ: మండలంలోని పొన్కల్‌ గ్రామానికి చెందిన తాటికొండ వినోద్‌ (28) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వినోద్‌ బండలఖానాపూర్‌ గ్రామంలో ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. గ్రామ సమీపంలో అటవీప్రాంతంలో పశువుల కాపరి రాజుకు గురువారం గుర్తుతెలియని మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వినోద్‌ తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వినోద్‌కు మెడకు గాయాలు ఉండడంతో ఎవరైన హత్య చేసి ఉంటారనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. సీఐ నవీన్‌కుమార్‌, ఎస్సై అశోక్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి యువకుడు..



రవికుమార్‌ (ఫైల్‌)

నిర్మల్‌టౌన్‌: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతిచెందిన సంఘటన గురువారం వెలుగుచూసింది. సీఐ మల్లేశ్‌ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌కు చెందిన తోట రవికుమార్‌ (36) మార్చి 16న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో బుధవారం స్థానిక ధర్మసాగర్‌ చెరువులో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. సాయంత్రం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే చీకటి పడడంతో గురువారం ఉదయం గజఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశాడు. దీంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పేర్కొన్నారు.